క్లుప్తంగా

చిన్నారులకు వైద్య పరీక్షలు



విద్యార్థినిని పరీక్షిస్తున్న వైద్యులు

కాకినాడ రూరల్: వాకలపూడి గ్రామంలోని ఉమా మనో వికాస కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్పీ రెడ్డి ఆధ్వర్యంలో కాకినాడ ప్రభుత్వాస్పత్రి వైద్యులు వి.వరప్రసాద్, డాక్టర్ వి.రోజా, డాక్టరు ఎన్పీ వికాసిని, డాక్టరు హేమ వినీలా రత్నం తదితరులు 64 మంది చిన్నారులకు వైద్య సేవలందించారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ మండల న్యాయ సేవల చైర్మన్, అదనపు జడ్జి ఆదేశాల మేరకు ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఐ.ప్రభాకర్ సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారన్నారు. తమ కేంద్రంలోని చిన్నారులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం ద్వారా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.

విలీనంపై ద్వంద్వ వైఖరి వద్దు

సామాజికవేత్త దూసర్లపూడి

కాకినాడ రూరల్: కాకినాడ కార్పొరేషన్‌లో గ్రామాల విలీనంపై ద్వంద్వ వైఖరి వద్దని సామాజిక వేత్త, పౌర సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు పేర్కొన్నారు. మండలంలోని ఆరు గ్రామాల విలీన అంశంపై ఎమ్మెల్యే పంతం నానాజీ అసెంబ్లీలో ప్రస్తావించడం హర్షణీయమని, అయితే పంచాయతీ ఎన్నికలని, కార్పొరేషన్‌లో విలీనమని రెండు రకాలుగా మాట్లాడడం సరైనది కాదన్నారు. విలీన ప్రతిపాదిత గ్రామాల ప్రజలు, అర్బన్ ఏరియా ప్రజలు కోరుకుంటున్న విధంగా కార్పొరేషన్‌లో విలీనం పూర్తి చేయాలన్నారు. 14 ఏళ్లుగా నిలిచిపోయిన రూ.140 కోట్ల ఆర్థిక సంఘ నిధులు, రూ.80 కోట్ల కార్పొరేషన్ గ్రాంట్లకు చిక్కుముడి తొలగించి ప్రజలకు స్పష్టత ఇవ్వాలన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వరలక్ష్మి

కాకినాడ రూరల్: రమణయ్యపేట గ్రామ పరిధిలో రాయుడుపాలెం అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఆ ప్రాంత వృద్ధులకు శనివారం నారాయణ సేవ అధ్యక్షురాలు ఎం.వరలక్ష్మి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, అంగన్ వాడీ కార్యకర్త పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వరాహావతారంలో సీతారామస్వామి



బోట్‌క్లబ్: రజత చిన్న దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక మెయిన్‌రోడ్డులో ఉన్న సీతారామస్వామి వరాహ మూర్తిగా దర్శనమిచ్చారు. స్వామి వారికి ఉదయం అర్చకులు పంచామృతాభిషేకాలు చేశారు.

డ్రైనేజీలనూ వదలరా?

- అడ్డగోలుగా వాణిజ్య సముదాయ నిర్మాణం
- అధికార పక్షం మద్దతుతో ఇష్టారాజ్యం

కాకినాడ: ఐఏఎస్ అధికారి కమిషనర్‌గా ఉన్నప్పటికీ కాకినాడ నగరపాలక సంస్థలో అక్రమ నిర్మాణాలు అడ్డూ అదుపూ లేకుండా సాగిపోతున్నాయి. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా చివరకు డ్రైనేజీని ఆక్రమించి మరీ నిర్మాణాలు చేసేస్తున్నారు. ఇదంతా నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారిలో సాగుతుండడాన్ని చూసి జనం ముక్కున వేలేసుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నగరపాలక సంస్థ పరిధిలోని శ్రీచైతన్య ఈ-టెక్నో స్కూల్ భవనాన్ని ఆనుకొని లక్ష్మీనారాయణ నగర్ ప్రాంతంలో మెయిన్‌రోడ్డుపై ఆరు దుకాణాలు నిర్మిస్తున్నారు. కొద్ది రోజులుగా ఈ నిర్మాణాలు సాగుతున్నప్పటికీ పట్టణ ప్రణాళికా విభాగం ఏ మాత్రం పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. సదరు దుకాణ సముదాయానికి ఎలాంటి అనుమతులు లేకపోవడం ఒక తప్పయితే.. నగరపాలక సంస్థకు చెందిన డ్రైనేజీని ఆక్రమించి మరీ నిర్భయంగా నిర్మించేస్తున్నారు. అడిగేవారెవరూ లేరనే ధీమాతో అధికార పార్టీకి చెందిన నేతల మద్దతు పుష్కలంగా ఉండడంతో బరితెగించి మరీ కట్టేస్తున్నారు. విద్యా సంస్థల సముదాయాలు ఉండే ఆ ప్రాంతం నిత్యం వేలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ప్రజలు రాకపోకలు సాగే ఆ ప్రాంతంలో అందరి దృష్టి సదరు దుకాణ సముదాయంపైనే ఉంది. రోడ్డుపైకి వచ్చి మరీ ఇలా ఎలా కట్టేస్తున్నారంటూ జనం చర్చించుకుంటున్నారు. ప్రధానంగా సాంబమూర్తినగర్ ప్రాంతంలోని సదరు దుకాణ సముదాయం నిర్మిస్తున్న ప్రాంతం తరచూ చిన్నపాటి వర్షానికి ముంపునకు గురౌతోంది. అలాంటి ప్రధాన ప్రాంతంలో డ్రైనేజీలను ఆక్రమించి మరీ నిర్మాణాలు చేస్తున్న తీరును చూసి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి కట్టడాలను ఉపేక్షిస్తే భవిష్యత్‌లో ఆ ప్రాంతం మరింత దుర్భరంగా మారే ప్రమాదం ఉందని గగ్గోలు పెడుతున్నారు. ఐఏఎస్ అధికారి స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కమిషనర్‌గా ఉన్న సమయంలో ఈ తరహా నిర్మాణాలు చేపట్టాలంటే హడలెత్తిపోయేవారు. ఇప్పుడు సరైన నియంత్రణ లేకపోవడంతో కొంత మంది వ్యక్తులు ఇలా అడ్డగోలు నిర్మాణాలను యథేచ్ఛగా చేసుకుపోతున్నారు. ఇందుకు అధికార పార్టీకి చెందిన స్థానిక నేతలు మద్దతు పలకడంతో టౌన్ ప్లానింగ్ విభాగం చేతులెత్తేస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇలాంటి అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు మార్జిన్‌లో డ్రైనేజీని ఆక్రమించి నిర్మిస్తున్న దుకాణాలు

కార్తిక దీపాలతో శివకేశవ సంకీర్తన



భోగి గణపతి పీఠంలో కార్తిక దీపాలంకరణ

బోట్‌క్లబ్: స్థానిక భోగి గణపతి పీఠంలో శ్రీవారి జపయజ్ఞ పారాయణ సందర్భంగా శనివారం దీపాలంకరణ సేవ వైభవంగా నిర్వహించారు. శివకేశవ సహస్ర నామావళి పఠించారు. ఈ సందర్భంగా పీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ మనో వికాసానికి, సద్గుణ సంపత్తికి పరబ్రహ్మ స్వరూపమైన కార్తిక దామోదర దీపం వైకుంఠ నారాయణుని ఆనంద ధామం అన్నారు. కార్తీకమాసం మూడవ సోమవారం సంకష్ట హర చతుర్థిరోజు నగర సంకీర్తన, లక్ష మారేడు దళాలతో మహాగణపతికి బిల్వార్చన, లక్షవత్తులతో ఆఖండ హారతి నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఠం సభ్యులు పాల్గొన్నారు.

సహకార స్ఫూర్తితో ముందడుగు



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి వెంకటకృష్ణ

- డీసీఓ వెంకటకృష్ణ పిలుపు

కాకినాడ: సహకార ఉద్యమ స్ఫూర్తితో ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించేలా కృషి చేయాలని జిల్లా సహకార అధికారి జి.వెంకటకృష్ణ పిలుపునిచ్చారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాలలో భాగంగా స్థానిక కేసీబీఎస్ ఆవరణలో శనివారం సాయంత్రం ఉపాధి కల్పన- నైపుణ్య అభివృద్ధిని పెంపొందించడంలో సహకార సంఘాల పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కేసీబీఎస్ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస్ సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీసీవో మాట్లాడుతూ సహకార రంగంలో ఉన్న ఎన్నో సంస్థలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయన్నారు. డీసీసీబీ సీఈఓ ఆర్వీ నరసింహారావు మాట్లాడుతూ సహకార వ్యవస్థ ద్వారా మెరుగైన ఉపాధి కల్పనతో పాటు నైపుణ్యాభివృద్ధి సాధన దిశగా ఆయా సహకార సంస్థలు మరింత శ్రమించాలన్నారు. డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసర్ బీకే దుర్గాప్రసాద్ మాట్లాడుతూ సహకార రంగం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. కేసీబీఎస్ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ సహకార రంగంలో ఉన్న తమ సంస్థ విజయవంతంగా నడుస్తూ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించగలుగుతుందన్నారు. కేసీబీఎస్ ఉపాధ్యక్షుడు రెడ్డి వీర రాజేంద్ర కుమార్ మాట్లాడుతూ సహకార రంగంలో ఉన్న తమ సంస్థ ఇటీవల వందేళ్లు పూర్తి చేసుకుని శతజయంతి ఉత్సవాలను కూడా నిర్వహించుకుందన్నారు. సమావేశాన్ని డీసీవో వెంకటకృష్ణ ఇతర అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కేసీబీఎస్ మహిళా ఉద్యోగులు సహకార గీతాన్ని ఆలపించారు. నైపుణ్యాభివృద్ధిని సాధించడంలో సహకార సంఘాల పాత్ర అనే అంశంపై రామదాసు సహకార శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కేసీబీఎస్ మేనేజర్ చీమలకొండ గంగాధరం అతిథులకు స్వాగతం పలికారు. సమావేశంలో డీసీసీబీ జీఎం పి.ప్రవీణ్ కుమార్, వారోత్సవాల ఇన్‌చార్జి ఆదిమూలం వెంకటేశ్వరరావు, కేసీబీఎస్ ఉపాధ్యక్షులు రెడ్డి వీర రాజేంద్రకుమార్, కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు ముత్తా మధు, ముమ్మిడి వెంకటరమణ, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

రోబోటిక్స్ కోర్సులకు మంచి డిమాండ్



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ రవీంద్రనాథ్

- జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్
- ముగిసిన రోబోటిక్ అప్లికేషన్స్ సదస్సు

బాలాజీచెరువు: ప్రపంచ సాంకేతిక రంగంలో భారత దేశం ముందంజలో ఉందని, రోబోటిక్ తదితర డిమాండ్ కోర్సులు అభ్యసించి నిష్ణాతులు కావాలని జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్ర నాథ్ విద్యార్థులకు సూచించారు. జేఎన్‌టీయూకేలో ఐఐపీటీ డైరెక్టర్ బీటీ కృష్ణ ఆధ్వర్యంలో రోబోటిక్ అప్లికేషన్ కస్టమ్ ఎంబెడెడ్ బోర్డ్‌ను అభివృద్ధి చేయడంపై మూడు రోజుల పాటు నిర్వహించిన ఉచిత వర్క్‌షాపు శనివారం ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ వర్సిటీ అనుబంధ విద్యార్థులకు ఉచితంగా వర్క్‌షాపు నిర్వహించడం సంతోషంగా ఉందని, ప్రపంచంలో ఆదరణలో ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటాసైన్స్ వంటి కోర్సులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఐఐపీటీ డైరెక్టర్ బీటీ కృష్ణ మాట్లాడుతూ ఇండస్ట్రీ 4.0 దృష్టిలో ఉంచుకుని వర్సిటీలో మొదటిసారిగా ఉచిత శిక్షణ ఇచ్చామని, త్వరలో మరిన్ని అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కె.దుర్గా గంగారావు, రిసోర్స్ పర్సన్లు రాజా, భువనేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లలను పనికి పంపితే కఠిన చర్యలు



కొరిపల్లి ఇటుక బట్టీ వద్ద తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కరప: బడి ఈడు పిల్లలు పాఠశాలల్లోనే ఉండాలని, అలా కాకుండా పనులకు పంపించినా, పనులు చేయించుకుంటున్నా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వి.పద్మావతి, ఎంఈఓ పి.సత్యనారాయణ హెచ్చరించారు. పనులకు వెళుతున్న బడిఈడు పిల్లలను గుర్తించేందుకు శనివారం వారు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మండలంలోని యండమూరు, కొరిపల్లి, పెదకొత్తూరు, చినకొత్తూరు తదితర గ్రామాల్లో అధికారులు పోలీస్ ఎస్కార్ట్‌తో పర్యటించి కిరాణా షాపులు, ఇటుక బట్టీలు, భవన నిర్మాణ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాపారులు, తల్లిదండ్రులకు బాలల హక్కులు, వారికి నేర్పించాల్సిన విద్యాబుద్ధుల గురించి వివరించి, అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పనికి కాకుండా బడికి పంపించి, విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు. 16 ఏళ్ల లోపు పిల్లలతో పనులు చేయించుకుంటే చట్టరీత్యా నేరమని వ్యాపారులకు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పద్మావతి, ఎంఈఓ సత్యనారాయణ అవగాహన కల్పించారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

కరప: రైతుల భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ తెలిపారు. మండలం గొర్రిపూడిలో శనివారం జరిగిన రీసర్వే-గ్రామసభలో ఆయన మాట్లాడారు. భూ విస్తీర్ణంలో హెచ్చు, తగ్గులున్నా, సర్వే నంబర్ల సబ్ డివిజన్ చేయించుకోవాలన్నా, మ్యుటేషన్ వంటి ఎటువంటి సమస్యలున్నా రైతులు దరఖాస్తు చేసుకుంటే వారి సమక్షంలో సర్వే చేయించి, సవరించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా 101 మంది రైతులు తమ భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకున్నట్టు తహసీల్దార్ తెలిపారు. నేటితో మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించడం పూర్తయిందని, వచ్చిన దరఖాస్తులు పరిశీలించి, రీసర్వే చేయడం జరుగుతుందన్నారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ డి.దుర్గాప్రసాద్, మండల సర్వేయర్ ఎస్.రూపవతి, ఆర్ఐ పవన్, దేవదాయశాఖ ఈఓ కె.తిరుమల రవితేజ, వీఆర్వోలు ఎల్ఎస్వీఆర్ గోపాలరావు, డీవీఎల్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాల ఫలితమే గ్రంథాలయ వ్యవస్థ



వేళంగి లైబ్రరీలో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్, విద్యార్థులు

కరప: ఎందరో మహానుభావుల ఉద్యమం ఫలితంగా గ్రంథాలయాలు ఏర్పడ్డాయని లైబ్రేరియన్ పాట్నీడి వెంకటరంగయ్య అన్నారు. వేళంగి ఉపగ్రంథాలయంలో నిర్వహిస్తున్న 57వ జాతీయ గ్రంథాలయాల వారోత్సవాల్లో భాగంగా శనివారం ఏర్పాటుచేసిన పాఠకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అయ్యంకి వెంకటరమణయ్య, వావిలాల గోపాలకృష్ణ, పాతూరి నాగభూషణం, ఎస్ఆర్ రంగనాథన్, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, సురవరం ప్రతాపరెడ్డి వంటి ప్రముఖుల ఉద్యమం ఫలితంగా గ్రంథాలయాలు ఏర్పడ్డాయన్నారు. ఈ సందర్భంగా అయ్యంకి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. వేళంగి గ్రాడ్యుయేట్ యూత్ సభ్యుడు ఎర్రా విక్రమ్, ఉపాధ్యాయులు సత్యానందం, ఎం.రామతులసి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జూనియర్ విభాగంలో 5, 6, 7 తరగతుల విద్యార్థులకు పరిసరాల శుభ్రతపై వ్యాసరచన, బాలల హక్కులపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కరప బ్రాంచ్‌లైబ్రరీలో కూడా రికార్డు అసిస్టెంట్ ఎస్‌వీఎస్ ఫణీంద్రకుమార్ పాఠకులతో కలసి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు.

త్యాగమూర్తుల ఫలితమే గ్రంథాలయాల నిర్మాణం

బాలాజీచెరువు: త్యాగమూర్తుల ఉద్యమాల ఫలితంగానే గ్రంథాలయ వ్యవస్థ ఏర్పడిందని ఎస్వీ రత్న పేర్కొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రామారావుపేట గ్రంథాలయంలో మాట్లాడుతూ సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో గ్రంథాలయాలు డిజిటలైజేషన్ చేయవలసిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు స్మార్ట్‌ఫోన్లు దూరం పెట్టి గ్రంథాలయాల పుస్తక పఠనం ద్వారా జ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో లేబ్రేరియ రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



గ్రంథాలయోద్యమ సారథులకు నివాళులర్పిస్తున్న అధికారులు, పాఠకులు

జిల్లా గ్రంథాలయంలో..

జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లైబ్రరీ సైన్స్ జూనియర్ లెక్చరర్ ఎస్.పెద్దిరాజు హాజరై మాట్లాడుతూ చిన్నతనం నుంచి క్రమ శిక్షణ, మంచి అలవాట్లు కలిగి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. సమాజ అభివృద్ధిలో గ్రంథాలయాల పాత్ర వివరించారు..ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రసాద్, డిప్యూటీ లేబ్రేరియన్ కిశోర్, ఎల్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పిల్లలతో మట్టిపనులపై వీడియో హల్‌చల్

బాలాజీచెరువు: పీఆర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో మట్టిపనులు చేయిస్తున్న వీడియో సోషల్ మీడియాలో శనివారం హల్‌చల్ చేసింది. ఇటీవలే పాఠశాల ఆవరణలో శిథిలావస్థకు చేరిన భవనాన్ని తొలగించగా అందులో ఉపయోగపడే ఇటుక బెడ్డలను విద్యార్థులతో తీయించి మెట్ల కింద ఏర్పాటు చేయిస్తున్నారు. ఈ వీడియో వైరల్‌గా మారడంతో చిన్నారులతో ఇటువంటి పనులు చేయించడం ఎంత వరకూ సమంజసమని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై పాఠశాల హెచ్ఎంను సంప్రదించడానికి ప్రయత్నించగా అందుబాటులో లేరు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి



చీడిగలో ప్రజాపోరు నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కాకినాడ రూరల్: కూటమి భాగస్వామ్య పార్టీలు సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని చీడిగలో గ్రామ శాఖ ఆధ్వర్యంలో శనివారం ప్రజాపోరు నిర్వహించారు. సీపీఎం నాయకులు పెద్దింశెట్టి రామకృష్ణ, జుత్తుగ శ్రీనివాసరావు, చింతపల్లి అజయ్‌కుమార్, అంకం సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, తదితరులు ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు.

ట్రస్ట్ ఆఫ్ బోండా సేవలు అభినందనీయం



వేళంగిలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ చక్రరావు

కరప: వేళంగి పరిసర గ్రామాల్లో పేదలకు ట్రస్ట్ ఆఫ్ బోండా అందిస్తున్న సేవలు అభినందనీయమని ఆల్ ఇండియా అనస్థీషియన్స్ అసోషియేషన్ అధ్యక్షుడు డాక్టర్ డీఎస్ఎస్‌సీ చక్రరావు, రాజమహేంద్రవరం స్వర్ణాంధ్ర సేవాసమితి అధ్యక్షుడు గుబ్బల రాంబాబు పేర్కొన్నారు. వేళంగి శ్రీనివాసా నర్సింగ్‌హోమ్‌లో శనివారం జరిగిన ట్రస్ట్ 18వ అర్ధ సంవత్సర సమావేశంలో వారు మాట్లాడారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బొండా వెంకన్నారావు మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అని భావించి సేవలు చేస్తున్నట్టు తెలిపారు. కాకినాడ దయా ఫౌండేషన్ భవన నిర్మాణానికి రూ.10 వేలు, కూరాడలో నిరుపేద కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించామన్నారు. డాక్టర్ చక్రరావు ఎవరికైనా గుండెపోటు వచ్చినప్పుడు చేయాల్సిన సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. అనంతరం 500 మంది వృద్ధులకు, మహిళలకు దుప్పట్లు ట్రస్ట్ సభ్యులతో కలసి పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యులు బొండా వీర వెంకట సత్యనారాయణమూర్తి, లక్ష్మి, డాక్టర్ బొండా సూర్యారావు, అనిత, డాక్టర్ బొండా రాజ్‌కుమార్, హరిణి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

కాకినాడ

ఆనంద్ సినిమాస్:	మట్కా, కంగువా, క, అప్పుడో ఇప్పుడో ఎప్పుడో
దేవీ స్క్రీన్స్:	మట్కా, కంగువా, అమరన్
పద్మప్రియ:	దేవర పార్ట్-1
శ్రీప్రియ:	మట్కా
సీఅండ్‌సీ-1:	క
సీఅండ్‌సీ-2:	అమరన్
సూర్య:	మట్కా
సూర్య:	అమరన్
లక్ష్మీ:	గ్లాడియేటర్-2
సత్యగౌరి:	మట్కా
తిరుమల:	కంగువా

కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరే రైళ్లు

ట్రైన్ నం.	స్టేషన్	గమ్య స్థానం	వెళ్లే సమయం	వచ్చే సమయం
17258	కాకినాడ పోర్టు	విజయవాడ (డైలీ మెము)	04.20	23.03
17267	కాకినాడ పోర్టు	విశాఖపట్నం (డైలీ మెము)	04.45	21.28
12755	కాకినాడ పోర్టు	భావనగర్ (భావనగర్)గురు	05.50	16.48
17206	కాకినాడ పోర్టు	సాయినగర్ (షిర్డీ) సోమ, బుధ, శని	06.10	18.55
17221	కాకినాడ పోర్టు	లోకమాన్య తిలక్ (ఎల్‌టీటీ) బుధ, శని	09.10	13.43
17655	కాకినాడ పోర్టు	పుదుచ్చేరి (సర్కార్) ఆది, బుధ, గురు	14.40	09.10
17644	కాకినాడ టౌన్	చెంగల్‌పట్టు (సర్కార్) సోమ, మంగళ, శుక్ర, శని	14.40	09.10
17250	కాకినాడ టౌన్	తిరుపతి డైలీ	15.15	11.45
17210	కాకినాడ టౌన్	బెంగళూరు (శేషాద్రి) డైలీ	17.25	06.45
12737	కాకినాడ పోర్టు	లింగంపల్లి (గౌతమి) డైలీ	19.20	06.58
07445	కాకినాడ టౌన్	లింగంపల్లి (స్పెషల్)సోమ బుధ, శుక్ర	20.10	07.10

స్పెషల్ ఎడ్యుకేటర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

19న ఇంటర్వ్యూలు

కాకినాడ రూరల్: మండలంలోని పి.వెంకటాపురంలో ఉన్న కాకినాడ కేంద్రీయ విద్యాలయలో కాంట్రాక్ట్ ప్రతిపాదికన స్పెషల్ ఎడ్యుకేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బి.శేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ నెల 19న మంగళవారం 9 గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని ఆసక్తి గల అభ్యర్థులు హాజరు కావాలని కోరారు. డిగ్రీ, ప్రత్యేక విద్యలో బీఈడీ అర్హత కలిగిన అభ్యర్థులు వెబ్‌సైట్ www.kakinada.kvr.ac.inలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

కుక్క కాటుతో యువకుడి మృతి

కాకినాడ రూరల్: మండలంలోని తూరంగి బుల్లెబ్బాయి రెడ్డి కాలనీకి చెందిన యువకుడు అయినవిల్లి సాయి దుర్గాప్రసాద్ (28) కుక్క కాటుతో శనివారం కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇంద్రపాలెం పోలీసులు తెలిపిన వివరాల మేరకు దుర్గాప్రసాద్‌ను మూడు నెలల క్రితం తూరంగిలో వీధి కుక్క కరిచింది. ఇటీవల కొద్ది కాలం నుంచి అతడు ర్యాబిస్ లక్షణాలతో బాధపడుతున్నాడు. శనివారం ఉదయం గుండెల్లో నొప్పిగా ఉందని దుర్గా ప్రసాద్ చెప్పడంతో కుటుంబ సభ్యులు కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. సాయంత్రం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి కుమారి ఫిర్యాదు మేరకు ఇంద్రపాలెం ఎస్సై సూర్యకుమార్ కేసు నమోదు చేశారు. చేతికి అందివచ్చిన కుమారుడి మృతితో తల్లిదండ్రులు కుమారి, నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగి పోయారు. ఆదివారం పోస్టుమార్టం అనంతరం మృతికి కారణం తెస్తుందని పోలీసులు తెలిపారు.